జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 4 | మార్చి | 2026 ◆ పేజీలు : 5

## క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



**భద్రాచలం, మార్చి 3,ప్రజాజ్యోతి :** 2026-27 విద్యా సంవత్సరంకు గాను కిన్నెరసాని, కచనపల్లి బాలుర, బాలికల పాఠశాలలు, వాటర్ స్పోర్ట్ అకాడమీ హైదరాబాద్ లోని పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాల్ తెలిపారు. ఈ ప్రవేశాలకు ఈ నెల 16 నుంచి 18 వరకు , 28, నుంచి 30 వరకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆగస్టు 31 2026 నాటికి 11 సంవత్సరాలు నిండిన వారు తగిన ధృవీకరణ పత్రాలతో కొత్తగూడెం జిల్లాకు చెందిన వారు కిన్నెరసాని క్రీడా పాఠశాలలో, ఖమ్మం జిల్లాకు చెందిన వారు ఉసిరికాయలపల్లి ఆశ్రమ ఉన్నతపాఠశాలలో సంప్రదించాలని కోరారు. జిల్లాస్థాయి ఎంపికలు ఈ నెల 16నుంచి 18 వరకు, తుది ఎంపికలు బ్యాటరీ టెస్టు 28 నుంచి 30 వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన వారికి 5వ తరగతిలో ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. పూర్తి సమాచారం కోసం కిన్నెరసాని, ఉసిరికాయలపల్లి పాఠశాలల్లో సంప్రదించాలని కోరారు.

# రయ్... రయ్..!

- బాబోయ్ మైనర్ డ్రైవింగ్ ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్న మైనర్లు!
- అతివేగం ఫ్యాషన్
- ప్రమాదం జరిగితే తండ్రిపై కేసు
- ఇల్లందు ప్రధాన రోడ్డు బిటి రోడ్డు వల్ల పెరిగిన స్పీడ్
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురి సూచన!

2 లో..



రయ్... రయ్.. మంటూ మైనర్లు రోడ్లపై దుమ్ము రేపుతున్నారు... వారి వాహనాల వేగానికి పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. మైనర్లకు వాహనం ఇవ్వవద్దని చట్టాలు చెబుతున్న అవి కొంతమంది మైనర్ల తల్లిదండ్రులకు పట్టడం లేదు. తమ బిడ్డ బండి తోలుతున్నాడనే మురిపమే తప్ప జరగరానిది జరిగితే ఎదుర్కొనే పరిణామాలపై ఆందోళన పడటం లేదు. దీంతో రోడ్లపై మైనర్లు దూసుకుపోతున్నారు. పోలీస్ శాఖ నిఘా గట్టిగా ఉన్నా కానీ పట్టణంలోని ప్రధాన రోడ్లు, బస్తీలు, గల్లీలలో వీరి దెబ్బకు అందరు హడలిపోతున్నారు.

● ఇల్లందు, ప్రజాజ్యోతి

## విధితో పోరాడుతున్న "కార్యదర్శి "

- కన్నీరుపెడుతున్న గుండెచప్పుడు
- ప్రభుత్వ సేవకురాలికి పెద్ద కష్టం
- గుండె చికిత్సకు రూ.20 లక్షల అవసరం
- మనసున్నవారి చేయూత కోసం మౌన విన్నపం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 03, ప్రజా జ్యోతి:** విధి ఆడిన వింత నాటకంలో ఒక నిండు ప్రాణం విలవిలలాడుతోంది. కన్నవారిని కోల్పోయిన పుట్టెడు దుఃఖం ఒకవైపు.. ప్రాణాంతక వ్యాధి చేస్తున్నదాడి మరో వైపు. బ్రతకాలన్న తపన ఉన్నా, అందుకు అవసరమైన ఆర్థిక స్తోమత లేక దుమ్ముగూడెం మండలం దంతెనం గ్రామ పంచాయతీ కార్యదర్శి బెక్కంటి మాధవి పరిస్థితి ప్రస్తుతం అత్యంత దయనీయంగా మారింది.

**చితికిపోయిన కుటుంబం**

మాధవి తండ్రి బెక్కంటి శ్రీనివాస్ ( మండల పరిషత్ అభివృద్ధి అధికారి ) నీతి నిజాయితీ గల అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అయితే, ఇతరులకు పూచీకత్తు సంతకాలు పెట్టడం వల్ల వచ్చిన ఆర్థిక ఇబ్బందులు

మిగతా 2 లో...

## హోలీ పండుగలో విషాదం

- గోదావరిలో దిగిన ఇద్దరు యువకులు గల్లంతు
- గాలింపు చర్యల్లో పోలీసులు



**మణుగూరు , మార్చి 3, (ప్రజాజ్యోత) :** రంగుల పండుగ హోలీ ఆనందం ఒక్కసారిగా విషాదంగా మారింది. మణుగూరు మల్లెపల్లి సింగరేణి వాటర్ ట్యాంక్ సమీపంలోని గోదావరి నదిలో స్నానానికి దిగిన ఇద్దరు వ్యక్తులు గల్లంతైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గుండి నాగేశ్వరరావు (40), పద్దం ప్రసాద్ (35) అనే ఇద్దరు యువకులు హోలీ సందర్భంగా గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లి నీటిలో కనిపించకుండా పోయినట్లు సమాచారం. వీరిలో ప్రసాద్ సింగరేణి సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. గల్లంతైన ఇద్దరూ మణుగూరు మండలం పద్మగూడెం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే మణుగూరు ఎస్సై శ్రావణ్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. నదిలో ప్రత్యేక బృందాలతో వెతుకులాట కొనసాగుతోంది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఆనందంగా మొదలైన పండుగ వేళ ఈ అనూహ్య సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్నినింపింది.

## మతసామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకుందాం...

- ప్రజల మధ్య ఐక్యత భావం పెంచుతున్న 'ఇఫ్తార్'
- సమాజంలో శాంతిని నెల కొల్పుతున్న పవిత్ర రంజాన్ మాసం
- రంజాన్ మాస స్ఫూర్తితో రాగద్వేషాలు దూరం చేసుకోవాలి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- జామ మసీదులో ఇఫ్తార్ కు హాజరైన ఎమ్మెల్యే కూనంనేని




**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 3 ,ప్రజా జ్యోతి:** మతసామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకోవడం మనందరి బాధ్యతని, అందుకు పండుగలు

మిగతా 2 లో...

## విధితో పోరాడుతున్న "కార్యదర్శి "

(మొదటి పేజీ తరువాయి...)

ఆయనను కుంగదీశాయి. ఆ ఒత్తిడిలోనే ఆయన భార్య 2024 జూలై 25న మెదడు పక్షవాతంతో మరణించగా, ఆ విషాదాన్ని తట్టుకోలేక సరిగ్గా పద మూడు రోజుల వ్యవధిలోనే శ్రీనివాస్ కూడా కన్నుమూశారు. తల్లిదండ్రుల వైద్యం కోసం మాధవి తన వద్ద ఉన్న నగలు, పొదుపు మొత్తాన్ని పూర్తిగా ఖర్చు చేశారు.

**మృత్యువుతో పోరాటం...**

తల్లిదండ్రుల మరణ వేదన నుండి కోలుకోకముందే మాధవికి తీవ్రమైన ఆయాసం మొదలైంది. పరీక్షించిన హైదరాబాదు వైద్యులు ఆమెకు 'గుండె కవాటాల వ్యాధి' ఉందని, గుండెలోని మూడు కవాటాలు పూర్తిగా దెబ్బతిన్నాయని తేల్చారు. తక్షణమే శస్త్రచికిత్స చేసి మూడు జంతు సంబంధిత కవాటాలు వేయకపోతే ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు.

**నిధులు లేక ఆగుతున్న శ్వాస...**

ఈ శస్త్రచికిత్సకు సుమారు రూ. 20 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఇప్పటికే సర్వస్వం కోల్పోయిన మాధవి వద్ద ఇప్పుడు చిల్లిగవ్వ కూడా లేదు. అటు అనారోగ్యం వల్ల విధులకు హాజరు కాలేకపోవడంతో జీతం కూడా అందడం లేదు. ఆత్మాభిమానం అడ్డు వస్తున్నా, ఊపిరి తీసుకోవడమే నరకంగా మారడంతో ఆమె సమాజం వైపు దీనంగా చూస్తున్నారు.

**మనవంతు చేయూతనిద్దాం...**

ఒక ప్రభుత్వ ఉద్యోగిగా పదిమందికి సేవ చేసిన మాధవి, నేడు తన ప్రాణం కోసం పోరాడుతోంది. తోటి పంచాయతీ కార్యదర్శులు తమ వంతు సాయం చేస్తున్నప్పటికీ, శస్త్రచికిత్స మొత్తానికి అది సరిపోవడం లేదు. ఉదారహృదయులు స్పందించి ఆమెను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఆర్థిక సాయం చేసే వారు 9398516470 (పి. శ్రీనివాసరావు) సంప్రదించవచ్చని అభ్యర్థిస్తున్నారు.

## మతసామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకుందాం



(మొదటి పేజీ తరువాయి...)




దోహదపడతాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని జామ మసీదులో ఇఫ్తార్ కార్యక్రమానికి అయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక నమాజు అనంతరం ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతా భావం పెంచుతున్నాయని అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సమాజంలో శాంతిని నెలకొల్పుతుందని, ప్రజల, కులాలు, మతాల మధ్య గద్వేషాలను దూరం చేస్తుందన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు చేపట్టిన కఠినమైన ఉపవాస దీక్షలు వారి కుటుంబాలతో పాటు సమాజంలో శాంతిని, ప్రేమను నెలకొల్పడానికి, సోదర భావం, దాతృత్వాన్ని పెంచడానికి దోహదపడుతుందని, ప్రజాస్వామ్య దేశంలో కులమతాలకతీతంగా మతసామరస్యాన్ని చాటి చెబుతోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికోసం, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులకు తాను చేస్తున్న కృషికి ప్రజలు, అధికారులు సహకరించి మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ముస్లిం మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు ఇట్టి వెంకట్రావు, గౌతమి కృష్ణ, వల్లపు యాకయ్య, వైఎస్ గిరి, ఉప్పుశెట్టి రాకేష్, వెంకటరత్నం, కర్రు రమేష్, మస్తాన్, ఆదినారాయణ, దినేష్, రామాచారి, అల్లి వెంకటేశ్వర్లు, బీమా నాయక్, వెంకటేశ్వర్లు, లాల్ పాషా, మసీదు పెద్దలు ఫయాజ్, అభిద్, అక్బర్, మస్తాన్, గౌస్, కృర్షిద్, ముత్తు జాలి, కురిషి, రషీద్, రెహమాన్, గౌస్, అంజద్, పాల్గొన్నారు.

# రయ్... రయ్..!



- బాబోయ్ మైనర్ డ్రైవింగ్ ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్న మైనర్లు!
- అతివేగం ఫ్యాషన్
- ప్రమాదం జరిగితే తండ్రిపై కేసు
- ఇల్లందు ప్రధాన రోడ్డు బిటి రోడ్డు వల్ల పెరిగిన స్పీడ్
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురి సూచన!

**రయ్... రయ్.. మంటూ మైనర్లు రోడ్లపై దుమ్ము రేపుతున్నారు... వారి వాహనాల వేగానికి పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. మైనర్లకు వాహనం ఇవ్వవద్దని చట్టాలు చెబుతున్న అవి కొంతమంది మైనర్ల తల్లిదండ్రులకు పట్టడం లేదు. తమ బిడ్డ బండి తోలుతున్నాడనే మురిపమే తప్ప జరగరానిది జరిగితే ఎదుర్కొనే పరిణామాలపై ఆందోళన పడటం లేదు. దీంతో రోడ్లపై మైనర్లు దూసుకుపోతున్నారు. పోలీస్ శాఖ నిఘా గట్టిగా ఉన్నా కానీ పట్టణంలోని ప్రధాన రోడ్లు, బస్తీలు, గల్లీలలో వీరి దెబ్బకు అందరు హడలిపోతున్నారు.**

● ఇల్లందు, ప్రజాజ్యోతి

గతంలో ఇల్లందు ప్రధాన రోడ్డు సీసీ రోడ్డు ఉండడమే కాక గుంతల మయంగా ఉండేది. ప్రస్తుతం ప్రధాన రోడ్డును బిటి రోడ్డు వేయడం వల్ల మైనర్లు జోష్ తో ద్విచక్ర వాహనాలను వేగాన్ని అంచనా వేయకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు రవాణా చట్టంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. మైనర్లకు బైక్ ఇచ్చి జరగరానిది ఏదైనా జరిగితే తండ్రిపై కేసు నమోదు చేస్తారు. అంతేకాకుండా శిక్ష కూడా ఉంటుంది. వాహనం ఇచ్చే ముందు అర్హులా.. కాదా అనేది తెలుసుకోవాలి. దీనిపై మరింతగా రవాణా శాఖ అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లలు మారం చేయడం, గారాబం వల్ల బైక్ ఇచ్చి వారికి ఆపదలోకి నెత్తుతుంటారు కొంతమంది తల్లిదండ్రులు. గుంతల రోడ్లపై రయ్ రయ్ మంటూ వెళుతూ ప్రమాదం బారిన పడుతున్నారు. వారు ప్రమాదాల బారిన పడడమే కాకుండా ఇతరుల ప్రాణాల మీదకు తెస్తున్నారు. మైనర్లు వాహనం నడిపి ఇతరుల మరణానికి కారణం అయితే జువైనల్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి విచారణ నిర్వహించి వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేయడంతో పాటు రూ.25 వేల జరిమానా విధించడం జరుగుతుంది. వాహనం ఇచ్చిన తండ్రికి మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం కూడా ఉంది. అంతే కాకుండా ఈ మధ్య కాలంలో సరికొత్తగా వాహనాల సైలెన్సర్లను మార్చి శబ్దం అధికంగా వచ్చే వాటిని ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు మరింత భయానికి గురవుతున్నారు. ఇల్లందు ప్రధాన రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ కు కళ్లెం వేయాలని పలువురు కోరుతున్నారు. బండి నడిపేందుకు వీరు అర్హులు 1988 చట్టం ప్రకారం వాహనం నడిపేందుకు వయసు 18ఏళ్ళు నిండి ఉండాలి. ఇంజన్ సామర్థ్యం 50సిసి మించరాదు. వాహనం ఎవరు పేరున ఉంటే వారే నడపాలి. 18ఏళ్ళు నిండిన వారు నిబంధనలకు విరుద్ధంగా వాహనం నడిపి ఒకరి మృతికి కారకులైతే వారిపై కేసు నమోదు చేసి వారిని జువైనల్ హెూమ్ కు తరలిస్తారు. తండ్రిపై హత్య నేరం కింద కేసు నమోదు చేస్తారు. దీనికి ఏడాది నుండి మూడేళ్లు జైలు శిక్ష విధిస్తారు. వాహన రిజిస్ట్రేషన్ రద్దు అవుతుంది.

## మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు

### తాటిపాముల సురేష్, సిఐ .. ఇల్లందు



మైనర్లకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వాహనాలు ఇవ్వవద్దు. అతివేగం వల్ల ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ మైనర్ల జీవితం నాశనం అవుతుంది. తండ్రిపై సైతం కేసు నమోదు చేస్తారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించవద్దని తల్లిదండ్రులు గారాభం తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది.



# విద్యార్థి... విజయీభవ

- 'పది' కి... ఇలా పదునెడదాం
- సాధనతో ఫలితం పదిలం
- శతశాతం ఫలితాలు లక్ష్యంగా ఉపాధ్యాయుల కృషి
- చక్కనిరాతతో.... మార్కులపంట

**దమ్మపేట, మార్చి 03, ప్రజాజ్యోతి:** ప్రతి విద్యార్థికి తమ జీవితంలో అత్యంత కీలకమైన టర్నింగ్ పాయింట్ పదవ తరగతిలో సాధించే మార్కులే,పాఠశాలలో విద్యార్థులు సాధించే నైపుణ్యాలు భవిష్యత్తులో పునాదిగా నిలుస్తాయనటంలో సందేహం లేదు. అంతేకాదు పదవ తరగతి సబ్జెక్టులలో పొందే మార్కుల ఆధారంగా తరువాత విద్యార్థులు చదవాల్సిన ఉన్నత విద్య కోర్స్ పై స్పష్టత వస్తుంది. ఇంతటి కీలకమైన పదవతరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. పదో తరగతి పరీక్షలు.. మార్చి 16వ తేదీ నుంచి ప్రారంభం. కాకున్నాయి. విద్యార్థులంతా మంచి గ్రేడ్ పాయింట్లు సాధించేలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలతో పాలు ప్రభుత్వ పాఠశాలల్లోనూ నిత్యం ఉదయం సాయంత్ర సమయాల్లో అదనపు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షల కోసం సిద్ధం చేస్తున్నారు. దాదాపు అన్ని పాఠ్యాంశాలు పూర్తయ్యాయి. గణితం, సైన్సు సోవల్, ఆంగ్లం తో పాటు అన్ని సబ్జెక్టులను ఉపాధ్యాయులు ఇప్పటి రెండుసార్లు పూర్తి చేశారు. కఠినమైన పాఠ్యాంశాలను మళ్లీ వివరిస్తూ,వాటిని విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునేలా శిక్షణ ఇస్తున్నారు. పబ్లిక్ పరీక్షల లక్ష్యంగా ప్రతి సబ్జెక్టులోనూ నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి పక్క ప్రణాళికతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

**పదికి పది పాయింట్లు వచ్చేలా శిక్షణ**

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా పదికి పది పాయింట్లు సాధించడంతో పాటు 100% ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం స్టడీ అవర్ పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల్లో ఉన్న భయాలను తొలగించి వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. 'పదో తరగతిలో విద్యార్థులు మంచి మార్కులు, జీపీఏ సాధించాలంటే.. పాఠ్యపుస్తకాల అభ్యసనంతో పాటు అనువర్తిత దృక్పథం సొంతం చేసుకోవాలి. చదివే ప్రతి అంశాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకుంటూ.. ఆయా పాఠ్యాంశాలలో ఇంశాలపై పట్టు సాధించాలి' అంటున్నారు నిపుణులు.

**ఉత్తమఫలితాలు సాధిస్తాం: మండల విద్యాశాఖ అధికారి జగపతి**



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజు పాఠ్యాంశాలలోని సందేహాలను నివృత్తి చేస్తు మంచి ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

**అక్షర దోషాలు లేకుండా సమాధానం సూటిగా రాయాలి...**

**ఎస్.కె మస్తాన్ ఆలీ.. ప్రధానోపాధ్యాయులు, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల గండుగులపల్లి**

విద్యార్థులు ముందుగా ప్రశ్నను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుని సమాధానం రాయాలి. అక్షర దోషాలు ఉండకుండా చక్కటి చేతిరాతతో కొట్టివేతలు లేకుండా సమాధానం సూటిగా రాసేలా చూసుకోవాలి. విద్యార్థులు



పాఠ్యాంశాలతో పాటు చేతిరాతను మెరుగుపరచుకోవడం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి అందంగా, వేగంగా రాయడం పరీక్షల్లో విజయానికి దోహదం చేస్తుంది. పాఠ్యాంశాలను చదవడంతో పాటు చదివిన వాటిని పదే పదే రాస్తూ ఉండటం వల్ల ఆటు రాతకు ఇటు ఆయా పాఠ్యాంశాలను గుర్తుంచుకోవడానికి ఉపయోగపడుతుంది. తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు.

**పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యాం...**

**కే. సాహిని నాగశ్రీ... 10వ తరగతి విద్యార్థి**



పబ్లిక్ పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యాం. మా ఉపాధ్యాయులు ఇప్పటికే అన్ని పాఠ్యాంశాలను ఒకటికి రెండుసార్లు పూర్తి చేశారు.. కొన్ని కష్టమైన పాఠ్యాంశాలను విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రతి సబ్జెక్టులోనూ నూడుశాతం ఉత్తీర్ణత

**మంచి ఉత్తీర్ణత లక్ష్యంగా పెట్టుకున్నాం..**

**. ఎస్. యోగేంద్ర విద్యార్థి**

వార్షిక పరీక్షలలో మంచి ఉత్తీర్ణతే లక్ష్యంగా పెట్టుకున్నాం అందుకు అనుగుణంగా చదువుకుంటూ పాఠ్యాంశాలలో పట్టు సాధిస్తున్నాం.. ఉపాధ్యాయుల ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు చేతిరాతపై కూడా శ్రద్ధ చూపించేలా ఎంతో విలువైన సలహాలు సూచనలు ఇస్తున్నారు.



**పదికి.. పది గురి పెడుతున్నాం..**

**పి. గంగాభవాని విద్యార్థి**



పదికి పది జీపీఏ సాధించేందుకు గుర్తి పెడుతున్నాం. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో తరగతులు నిర్వహించడం వలన చదివే ప్రతి విషయాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకుంటున్నాం. పాఠ్యాంశాలపై పట్టు సాధించేందుకు మా ఉపాధ్యాయుల కృషి మాకు ఎంతో ఉపయోగపడుతుంది.

**చక్కటి ప్రణాళికతో చదువుతున్నాం..**

**సిహెచ్ శబరీష్ విద్యార్థి**



చక్కటి ప్రణాళికతో చదువుకుంటే.. మంచి మార్కులు సాధించడం కష్టమేమీ కాదన్నా మా ఉపాధ్యాయుల సూచనలు సలహాలతో మంచి ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యనభ్యసిస్తున్నాం. ప్రాక్టీస్ కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వటం వలన, పరిజ్ఞానం మరింత పెంపొందించుకుంటున్నాం ఎలాంటి ఒత్తిడి లేకుండా మంచి మార్కులు సాధించేందుకు ఉపాధ్యాయులు తర్ఫీదు నిస్తున్నారు.

---

## బ్యాంకు అధికారుల పేరుతో సైబర్ మోసం

- రిటైర్డ్ ఉద్యోగి ఖాతా నుంచి రూ. 2 లక్షలు మాయం
- యోనో యాప్ సమస్య పేరుతో నకిలీ ఫైల్ ఇన్‌స్టాల్ చేయించి దోపిడి

**భద్రాచలం, మార్చి 3,ప్రజాజ్యోతి :** బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి నమ్మబలికిన సైబర్ నేరగాళ్లు భద్రాచలానికి చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగిని మోసం చేసి రూ. 2 లక్షలు దోచుకున్నారు. స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా కు చెందిన యోనో యాప్‌లో సాంకేతిక సమస్య ఉందని చెప్పి, నకిలీ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేయించడంతో ఈ ఘటన జరిగింది.భద్రాచలం పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను ఎస్బీఐ ప్రధాన శాఖ నుంచి మాట్లాడుతున్నానని తెలిపాడు. మీ యోనో యాప్‌లో సమస్య ఉందని, వెంటనే సరిచేయకపోతే ఖాతా నిలిచిపోతుందని భయపెట్టాడు. సమస్య పరిష్కారం కోసం తాము పంపే లింక్ ద్వారా ఒక ప్రత్యేక ఫైల్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించాడు.అది నిజమేనని నమ్మిన బాధితుడు ఆ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయగా, కొద్ది సేపట్లోనే అతని ఖాతా నుంచి విడతల వారీగా మొత్తం రూ. 2 లక్షలు డెబిట్ అయినట్లు సందేశాలు వచ్చాయి. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నకిలీ ఫైళ్ల ద్వారా మొబైల్‌పై నియంత్రణ సాధించి బ్యాంకు వివరాలు సేకరించి ఈ మోసం చేసినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. అనంతరం పోలీసులు ప్రజలకు కీలక సూచనలు చేశారు అపరిచితుల నుంచి వచ్చే లింక్‌లు లేదా ఫైల్‌లు డౌన్‌లోడ్ చేయవద్దు,బ్యాంకు ఖాతా వివరాలు, గోప్య సంకేత సంఖ్యలు ఎవరితోనూ పంచుకోవద్దు,అనుమానాస్పద లావాదేవీలు గమనించిన వెంటనే సంబంధిత బ్యాంకు మరియు సైబర్ పోలీసులను సంప్రదించాలి ఇటీవలి కాలంలో ఇలాంటి సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.

---

## పినపాకలో ఘనంగా వన్యప్రాణుల దినోత్సవం – 2కే రన్ నిర్వహణ



**పినపాక,మార్చి 03(ప్రజాజ్యోతి):** పినపాక మండలం ఈ బయ్యారం అటవీ శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం వన్యప్రాణుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 2కే రన్ నిర్వహించారు.మండల కేంద్రం నుండి అటవీ శాఖ కార్యాలయం వరకు ఈ రన్ నిర్వహించగా, విజేతలకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. 2కే రన్ కార్యక్రమంలో 100 మందికి పైగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రేంజ్ ఆఫీసర్ తేజస్విని మాట్లాడుతూ "అడవులను రక్షించుకుందాం – వన్యప్రాణులను కాపాడుకుందాం" అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది ప్లకార్డులు ప్రదర్శిస్తూ "అడవుల పరిరక్షణ ద్వారా జీవనోపాధి – భూమిపై ప్రజల సుస్థిర జీవనానికి పునాది" అంటూ నినాదాలు చేశారు.అనంతరం కార్యాలయ ఆవరణలోని చెట్లకు పక్షులు నివసించేలా గూళ్లు ఏర్పాటు చేశారు. పర్యావరణ సమతుల్యతకు వన్యప్రాణులు కీలకమని, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.భవిష్యత్తు తరాల కోసం వన్యప్రాణులు, ప్రకృతి వనరులను కాపాడుకోవడం మన అందరి కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓలు అరుణ, వెంకటేశ్వరరావు, ఇతర అటవీశాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొత్తకాలనీలో కొలువుతీరనున్న ముత్యాలమ్మవారు

- మూడు రోజుల పాటు ఉత్సవాల నిర్వహణ
- మూడు వేల మందికి అన్నదానం



**భద్రాచలం, మార్చి 3,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని అశోకనగర్ కొత్తకాలనీలో ఉన్న శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభం ప్రతిష్టతో పాటు గణపతి ఆంజనేయ, సరస్వతి, దుర్గాదేవి, పోతురాలజు విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ వేడుకలను ఈ నెల ఆరో తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు నిర్వాహక కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. 6న గో పూజ, యాగశాలలో గణపతి పూజ, ఆరాధన, అంకురార్పణ నిర్వహించనున్నారు. 7న గ్రామ ఉత్సవం ఊరేగింపు, ఆదివాసీమూర్తులకు రక్షాబంధనం జరపనున్నారు. 8న రుద్రహోమం, మృత్యుంజయ హోమం, చండీహోమం నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా ఆయ నిర్మాణంకు 35 సెంట్ల స్థలాన్ని ఎడ్లపల్లి ఆంజనేయులు, గంగాలక్షి దంపతులు, వారి సంతానం అందజేశారు. మూడు రోజుల పాటు భక్తులకు అన్నదానం సైతం నిర్వహించనున్నారు.

## హోలీ సంబరాలు...

- ఆనందోల్లాసాలతో చిన్నారుల వేడుకలు



**అశ్వారావుపేట, మార్చి 03, ప్రజాజ్యోతి :** మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో ప్రజలు కుటుంబ సమేతంగా ఘనంగా హోలీ పండుగ వేడుకలను జరుపుకున్నారు. గాంధీ బొమ్మ సెంటర్, అటెండర్స్ కాలనీ, భద్రాచలం రోడ్డు, కా లింగ్ బజార్ తదితర కాలనీలలో మహిళలతో సహా, చిన్నపిల్లలతో రంగులు వేసుకుంటూ తమదైన శైలిలో శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా, తదుపరి ఆనందము ఐక్యతను స్వాగతించడానికి ఈ హోలీ పండుగను జరుపుకుంటారని వారు పేర్కొన్నారు.ఈ పండుగ ప్రహ్లాదుడు హోలిక కథతో ముడిపడి ఉందని తెలిపారు.

# పాల్వంచలో పండగపూట విషాదం

- రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి వ్యక్తి మృతి





**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 3,ప్రజా జ్యోతి:**రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం పాల్వంచలో చోటు చేసుకుంది, ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, పాల్వంచ శ్రీనగర్ కాలనీకి చెందిన మాచర్ల ఉమామహేశ్వరరావు(40) నవభారత్ కంపెనీలో మెటల్ ప్రొడక్షన్ వద్ద టాపింగ్ వర్క్ చేస్తున్నాడు, రోజు మాదిరిగా కంపెనీలో తన విధులు నిర్వహించుకొని తోటి కార్మికుడు వై దుర్గాప్రసాద్ తో కలిసి ద్విచక్ర వాహనంపై నవభారత్ కంపెనీ ప్రధాన గేటు నుండి బయటకు రాగానే చంద్రుగొండ మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన జబ్బ ప్రశాంత్ కొత్తగూడెం పైపునుండి ద్విచక్ర వాహనంపై పాల్వంచ వస్తుండగా అప్పుడే నవభారత గేటు నుండి భద్రాచలం ప్రధాన రహదారిపైకి వస్తున్న ఉమామహేశ్వరరావు ద్విచక్ర వాహనాన్ని దుర్గాప్రసాద్ ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది, ఈ ప్రమాదంలో నవభారత గేట్ నుండి బయటికి వచ్చిన మాచర్ల ఉమామహేశ్వరరావు తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా కొత్తగూడెం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు, ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరరావు ద్విచక్ర వాహనంపై ఉన్న దుర్గాప్రసాద్ కు తీవ్ర గాయాలు కాగా, జబ్బా ప్రశాంత్ కు ఆయన ద్విచక్రంపై ఉన్న మరో మహిళకు కూడా తీవ్ర గాయాలయ్యాయి, చికిత్స నిమిత్తం వీరిని స్థానిక పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, ప్రమాదంలో మృతి చెందిన ఉమామహేశ్వరరావుకు భార్య స్వరూప, ఇద్దరు పిల్లలు ఉన్నారు, ఈ మేరకు పాల్వంచ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం

- వన్యప్రాణులను కాపాడుకోవడం అందరి బాధ్యత డిఎఫ్ ఓ కృష్ణగౌడ్





**ఆళ్ళపల్లి. మార్చి3. ప్రజా జ్యోతి** మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీశాఖ అధికారి (డి ఎఫ్ ఓ) కృష్ణగౌడ్. మాట్లాడుతూ మానవ మనుగడ పర్యావరణంపైనే ఆధారపడి ఉందని, స్వచ్ఛమైన గాలి, ప్రాణవాయువు అందించే అడవులను కాపాడటం కేవలం అధికారుల పని మాత్రమే కాదని, అది ప్రజలందరి బాధ్యతని వారు పేర్కొన్నారు. అంతరించిపోతున్న అడవి జంతువులను కాపాడి, భావితరాలకు వాటిని సజీవంగా చూపించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. మండలంలోని సింగారం, పెద్ద వెంకటాపురం, దొంగతోగు గ్రామాలకు రహదారులు, ఆళ్లపల్లి – అనిశెట్టిపల్లి డబుల్ రోడ్డు పనులు మరియు 11 KV విద్యుత్ లైన్ ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలని రేసు ఎల్లయ్య డిఎఫ్ ఓను కోరారు సానుకూల స్పందన: ఈ విన్నపాలపై డిఎఫ్ ఓ కృష్ణగౌడ్ సానుకూలంగా స్పందిస్తూ, మండల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం ఎఫ్ డి ఓ. బాబు. ఆళ్ళపల్లి. ఎఫ్ ఆర్ ఓ. కిరణ్ కూమర్ రేగళ్ల ఎఫ్ ఆర్ ఓ. జస్వంత్ ప్రసాద్. చేతకొండ ఎఫ్ ఆర్ ఓ. కనకమ్మ. యానాంబైల్ ఎఫ్ ఆర్ ఓ. కవితమాధురి. స్థానిక ఎస్ ఐ సోమేశ్వర్.సర్పంచులుఊకె చిన్న పాపయ్య. కల్తీ వెంకటేశ్వర్లు. వజ్జ ఉమా. ఈసంరుక్మిణి. ఫారెస్ట్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామయ్య పెళ్లి పనులకు నేడు శ్రీకారం

- మిథిలా స్టేడియం వద్ద తలంబ్రాల తయారీకి ఏర్పాట్లు
- తీర్థబిందెతో వసంతోత్సవానికి అంకురార్పణ
- నేడు స్వామివారి నిత్య కల్యాణం రద్దు







**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి , మార్చి 3,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టను న్నారు. పెళ్లి పనులకు ఆదిమూలంగా భావించే పసుపు కొమ్ములను దంచి తలంబ్రాలు కలిపే వేడు కకు వైకుంఠ ద్వారం, మిథిలా స్టేడియం ప్రాంగణం సిద్ధమయ్యాయి. ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో ఈ వేడుకను అంగరంగవైభవోపేతంగా జరపడం ఆనవాయితీ. గత రెండేళ్లుగా భక్తులు సైతం పాల్గొనేలా మిథిలా స్టేడియం ప్రాంగణంలో ఈ వేడుకను ఆలయ ఈఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

**తలంబ్రాల తయారీతో మొదలు...**

వసంతోత్సవం రోజున భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలు కలిపే వేడుకను ప్రారంభించడం సంప్రదాయం. భక్తులు అత్యంత ఆధ్యాత్మికంగా భావించే ఈ కార్యక్రమాన్ని రెండేళ్లుగా మిథిలా స్టేడియం ప్రాంగణం, వైకుంఠద్వారం వద్ద నిర్వహిస్తున్నారు. పెళ్లి పనుల్లో భక్తులందరినీ భాగస్వాములు చేసేందుకు ఈ వేడుకకు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది 200 క్వింటాళ్ల తలంబ్రాలు కలిపేలా అధికారులు సన్నాహాలు చేస్తుండగా తొలి రోజు పసుపు, కుంకుమ దంచి, ప్రత్యేక గులాములతో 20 క్వింటాళ్ల తలంబ్రాలను సిద్ధం చేయనున్నారు. వసంతోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిత్యకల్యాణం రద్దు చేశామని, గురువారం నుంచి యథావిధిగా కొనసాగుతుందని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

**తీర్థ బిందెతో శ్రీకారం...**

ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా భద్రాద్రి రామాలయంలో బుధవారం జరగనున్న డోలోత్సవం, వసంతోత్సవానికి మంగళవారం అంకురార్పణ చేశారు. మేళ తాళాలు, అర్చకుల వేద మంత్రాల నడుమ పవిత్ర గోదావరి నదీ జలాలను తీసుకొచ్చి అంకురార్పణ చేశాక యాగశాలలో వాస్తు హోమం నిర్వహించారు.

**నేడు వసంతోత్సవం, డోలోత్సవం...**

బేడా మండపంలో శుక్రవారం వసంతోత్సవం, డోలోత్సవం జరపనున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి సహస్రధారలతో స్నపనం, అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారిని ఊయలలో ఆశీనులు చేసి డోలోత్సవం నిర్వహించనున్నారు. శ్రీ స్వర్ణ లక్ష్మీ అమ్మవారికి పంచామృత స్నపనం, సాయంత్రం 4 గంటలకు సామూహిక కుంకుమార్చన గావిస్తారు.

**ముత్యాల తలంబ్రాలు ఎంతో ప్రత్యేకం....**

భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం ఎంత ప్రత్యేకమో.. జానకిరాముల నుదిటి పైనుంచి జాలు వారే ముత్యాల తలంబ్రాలకూ అంతే ప్రత్యేకత ఉంటుంది. స్వామి, అమ్మవార్ల నుదుటి పైనుంచి జాలువారే తలంబ్రాలను తమపై చల్లుకుంటే ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, భోగభాగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఆది దంపతులు, అన్యోన్యానికి ప్రతీకలైన సీతారాముల కల్యాణంలో ఉపయోగించే ఈ తలంబ్రాలను తమ ఇంట ఉంచుకోవడానికి భక్తులు తహతహ లాడుతుంటారు. ఇక ఇళ్లలో జరిగే వివాహ వేడుక సందర్భంగా తయారుచేసే తలంబ్రాల లో ఈ ముత్యాలు కలిపిన స్వామి వారి తలం బ్రాలు కలిపితే దంపతుల నడుమ మరింత అనురాగం పెంపొందుతుందని, అన్యోన్య దాంపత్యానికి ప్రతీకగా ఉన్న శ్రీ సీతారాముల ఆశీస్సులు లభిస్తాయని పలువురు నమ్ముతుంటారు. అందుకే ఏటా భద్రాచలంలో దొరికే ముత్యాల తలంబ్రాలకు ఆదరణ పెరుగుతోంది. ఇక ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వారు భక్తిశ్రద్ధలతో గోటితో ఒడ్లను ఒలిచి తలంబ్రాలు తయారుచేసి రామయ్య కల్యాణానికి సమర్పించి స్వామి వారి కృపకు పాత్రులవుతున్నారు.

**కమనీయంగా రామయ్య కల్యాణం...**

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యా వాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

# హోలీ సందర్భంగా ఎస్‌టీఓ టి. సుభద్రకు ఆల్ పెన్షనర్స్ నాయకుల శుభాకాంక్షలు




**భద్రాచలం, మార్చి 3,ప్రజాజ్యోతి :**హోలీ పండుగ సందర్భంగా భద్రాచలం ఎస్‌టీఓ శ్రీమతి టి. సుభద్రను ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆమె నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు సి హెచ్ సుబ్బయ్య చౌదరి, ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎల్ వి ప్రసాద్, కోశాధికారి డి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు ఎం హరినాథ్, ఎస్ రాజబాబు, గోర్సా మురళీకృష్ణ, కార్యదర్శి వి సుబ్రహ్మణ్యం, నాయకులు ఎం కిషన్‌రావు, బన్సీలాల్, సూరిశెట్టి కృష్ణ, బందు నరసింహారావు, బైరు నరసింహారావు, మహిళా పెన్షనర్స్ నాయకులు సి హెచ్ సుందరనవమణి, ఏ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.పండుగల ద్వారా పరస్పర సౌహార్దం, ఐక్యత పెంపొందాలని నాయకులు ఆకాంక్షించారు.

# చంద్రగ్రహణం ఎఫెక్ట్...మూతబడిన ఆలయాలు

- సంప్రోక్షణ అనంతరం నేటి ఉదయం నుంచి యధావిధిగా భక్తులకు దర్శనం

**అశ్వారావుపేట, మార్చి 03, ప్రజాజ్యోతి :** నిత్యం భక్తులతో పూజలందుకుంటున్న పలు ఆలయాలు చంద్రగ్రహణం సందర్భంగా మూతపడ్డాయి. నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం కోనేటి బజార్లోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయం జంగారెడ్డిగూడెం రోడ్డులోని శ్రీ షిరిడి సాయి బాబా ఆలయం గుర్రాల చెరువులని స్వయంభు శ్రీ కనకదుర్గమ్మ ఆలయం తదితర ఆలయాలు ఆలయాల సాంప్రదాయాలను అనుసరించి శాస్త్రవేత్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మూసివేశారు. నేటి ఉదయం సంప్రోక్షణ అనంతరం స్వామి వార్లకు, అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనానికి అనుమతించనున్నారు.



# కంప్యూటర్ ముందే కరిగిపోతున్న జీవితం

- గుర్తింపు లేని సేవలకు గౌరవం ఎప్పుడొస్తుంది
- మీసేవ నిర్వాహకుల ఆవేదన




**పాల్వంచ ,మార్చి 3,ప్రజాజ్యోతి :** ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరే ప్రతి దశలో కనిపించే పేరు మీసేవ. పుట్టిన శిశువుకు జనన ధృవీకరణ పత్రం నుంచి మరణించిన వ్యక్తికి మరణ ధృవీకరణ పత్రం వరకు, విద్యార్థికి స్కాలర్షిప్ నుంచి రైతుకు ధరణి నమోదు వరకు ప్రతి అవసరంలో మీసేవ కేంద్రం కీలక పాత్ర పోషిస్తోంది. అయితే ప్రజలకు సేవలందిస్తున్న ఈ వ్యవస్థ వెనుక ఉన్న నిర్వాహకుల జీవితం మాత్రం ప్రశ్నార్థకంగా మారింది.

**సేవలు అన్నీ మాది...గుర్తింపు ఎవరిది**

కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్, మ్యారేజ్ సర్టిఫికెట్ వంటి అనేక ప్రభుత్వ సేవలు మీ సేవ ద్వారానే ప్రజలకు అందుతున్నాయి. ఎన్నికల సమయంలో ఓటర్ ఐడీ నమోదు, విద్యార్థుల స్కాలర్షిప్ దరఖాస్తులు, ఉద్యోగ దరఖాస్తులు వంటి బాధ్యతలు కూడా నిర్వాహకులపై పడుతాయి.అయితే మీసేవ నిర్వాహకుడు ప్రభుత్వ ప్రతినిధినా లేక ప్రైవేటు ఫ్రాంచైజీనా అన్న విషయంలో స్పష్టత లేకపోవడం వారి ప్రధాన ఆవేదన. బాధ్యతల విషయంలో ప్రభుత్వం ఆధారపడితే, హక్కుల విషయంలో మాత్రం ప్రైవేటు వ్యక్తిగా పరిగణించడం అన్యాయమని వారు భావిస్తున్నారు.

**పెట్టుబడి మా సొంతం...ఆదాయం మాత్రం తక్కువే**


మీసేవ కేంద్రం నడపడానికి కావాల్సిన కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇంటర్నెట్, అద్దె, విద్యుత్, సిబ్బంది జీతాలు అన్నీ నిర్వాహకుడి భాధ్యత. ఆధార్ సెంటర్ నిర్వహించాలంటే భారీ డిపాజిట్ చెల్లించాల్సి వస్తుంది. కఠిన నిబంధనలు పాటించాలి. రిజెక్షన్లు వస్తే పెనాల్టీలు కూడా చెల్లించాల్సి ఉంటుంది.అయితే నెలాఖరుకు ప్రభుత్వ కమిషన్ చాలా తక్కువగా ఉండటం వల్ల అప్పులు చేసి సెంటర్ నడపాల్సిన పరిస్థితి వస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు. పదిహేనేళ్లుగా కమిషన్లలో గణనీయమైన మార్పు లేదని వారు వాపోతున్నారు.

**ఆరోగ్య సమస్యలు...భవిష్యత్తుపై ఆందోళన**

రోజంతా కంప్యూటర్ ముందు కూర్చోవడం వల్ల బీపీ, షుగర్, కంటి సమస్యలు, నడుం నొప్పులు వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. కుటుంబ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. పిల్లలకు మెరుగైన జీవితం ఇవ్వగలమా అనే సందేహం వెంటాడుతోంది.పదిహేనేళ్లుగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తూ వారధిగా పనిచేస్తున్న మీసేవ నిర్వాహకులకు సరైన గుర్తింపు, ఆర్థిక భద్రత, కమిషన్ల పెంపు అవసరమని వారు కోరుతున్నారు. నిశ్శబ్దంగా సేవలందిస్తున్న ఈ వర్గం సమస్యలు ప్రభుత్వ దృష్టికి ఎప్పుడు వస్తాయన్న ప్రశ్నకు సమాధానం మాత్రం ఇంకా ఎదురుచూస్తూనే ఉంది.

## ఉపాధ్యాయురాలికి జాతీయ పురస్కారం

- తుర్రం జ్యోతి కి మహిళా కీర్తిరత్న జాతీయ పురస్కారం



**చర్ల, మార్చ్ 03:(ప్రజా జ్యోతి ):**చర్ల మండల పరిధిలోని తేగడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలు తుర్రం జ్యోతి మహిళా కీర్తి రత్న జాతీయ పురస్కారం (విమెన్ ఎక్సలెన్స్ అవార్డ్ 2026 ) అందుకున్నారు .మంగళవారం విజయవాడ లోని సర్వోత్తమ గ్రంథాలయం లో మహిళాదినోత్సవం పురష్కరించుకొని శ్రీశ్రీ కళావేదిక అధ్వర్యంలో వైభవం గా జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం లో శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా జ్యోతికి అవార్డ్ అందించి కిరీటం పెట్టి శాలువాతో సత్కరించి మెమెంటో అందించి ఘనంగా సత్కరించారు .ఈ సందర్భంగా తుర్రం జ్యోతి మాట్లడుతూ విద్యారంగం ,గిరిజన మహిళ అభివృద్ధి ,సేవా రంగం లో చేసిన కృషిని గుర్తించిన శ్రీశ్రీ కళావేదిక అవార్డ్ ఇవ్వడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని అవార్డ్ కి ఎంపికచేసిన సీఈఓ కత్తిమండ ప్రతాప్ ,జాతీయ అద్యక్షురాలు ఈశ్వరీభూషణం లకు కృతజ్ఞతలు తెలిపారు .

## 30 గ్రామాలకు నిలిచిపోయిన మిషన్ భగీరథ నీటి సరఫరా

- బ్రహ్మోత్సవాల సమయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో భక్తులు, చిరు వ్యాపారులు అవస్థలు



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 3, ప్రజా జ్యోతి:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డు వెడల్పు అభివృద్ధి పనుల సందర్భంగా కాంట్రాక్టర్ నిర్ల క్ష్య వైఖరితో హెవీ మిషన్ భగీరథ పైప్లైన్ డ్యామేజ్ కావడంతో సుమారు 30 గ్రా మాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది.శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర అసౌకర్యానికి కారణమైంది. అన్నపురెడ్డిపల్లి మండలంతో పాటు చండ్రుగొండ, సత్తుపల్లి మండలాల పరిధిలోని గ్రా మాలు, కిష్టారం గ్రామానికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పైప్ లైన్ లీక్ కావడంతో ఆలయ గ్రౌండ్ ప్రాంతమంతా నీరు చేరి, బ్రహ్మోత్సవాల్లో చిరు వ్యాపారం చేస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండుగ పర్వదినాన నీరు లేక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పై చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్పై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సమయస్ఫూర్తి చాటిన 108 సిబ్బంది



**ఆళ్ళపల్లి. మార్చి3. ప్రజాజ్యోతి** క్షతగాత్రుడికి ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ 108 సేవలు మరోసారి తమ ప్రత్యేకతను చాటుకున్నాయి. జిల్లా సమన్వయకర్త సతీష్ పర్యవేక్షణలో ఈ సేవలు మరింత వేగవంతమయ్యాయి. ఘటన వివరాలు బోడు కొత్తగూడెం గ్రామానికి చెందిన పూనెం రామయ్య. గుండాల మండలం కొడవటంచ నుంచి తిరిగి వస్తుండగా, జగ్గు తండా వద్ద బైక్ స్కిడ్ అవ్వడంతో రామయ్య కాలు విరిగింది.స్థానికులు సమాచారం అందించిన వెంటనే ఆళ్ళపల్లి 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ఇల్లందు ఆసుపత్రికి తరలించారు.సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడుతున్న 108 సిబ్బందికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా రంగుల హరివిల్లు

- ఘనంగా హోలీ సంబరాలు





**అన్నపురెడ్డిపల్లి, మార్చి 3,ప్రజా జ్యోతి:**అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా హోలీ పండుగను ప్రజలు అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామాలు, కాలనీలు, వీధులు రంగుల హరివిల్లులా మారాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ పండుగలో పాల్గొన్నారు. ఉదయం నుంచే యువత రంగులతో వీధుల్లోకి వచ్చి సంబరాలు ప్రారంభించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. చిన్నపిల్లలు బాటిళ్లలో రంగు నీటిని నింపుకుని స్నేహితులపై చల్లుతూ సందడి చేశారు.కొన్ని గ్రామాల్లో మహిళలు సంప్రదాయ పద్ధతిలో హోలీ జరుపుకున్నారు. సహజ సిద్ధమైన గోగు పూలతో తయారు చేసిన రంగులను ఉపయోగించడం విశేషంగా నిలిచింది. యువత డీజే పాటలకు నృత్యాలు చేస్తూ పండుగను ఉత్సాహంగా నిర్వహించారు.పిల్లలు గుంపులుగా తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి రంగులు చల్లుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. పెద్దలు చిన్నారులకు ఆశీస్సులు అందజేశారు.పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు, యువకులు జాగ్రత్తలు తీసుకున్నారు. పరస్పర గౌరవాన్ని పాటిస్తూ శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని సూచించారు.మొత్తానికి, అన్నపురెడ్డిపల్లి మండలంలో హోలీ పండుగ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది.

## గ్రావిటీ ప్రీమియర్ స్కూల్ లో హోలీ సంబరాలు



**టేకులపల్లి,మార్చి 03,ప్రజాజ్యోతి:**టేకులపల్లి మండలం కేంద్రంలోని గ్రావిటి ప్రీమియర్ స్కూల్ లో మంగళవారం హోలీ సంబరాలు పిల్లలు, అధ్యాపకులు కలిసి ఎంతో ఘనంగా జరుపుకున్నారు . ఒకరికొకరు రంగులు పూసుకుంటూ, చిన్నా పెద్ద అనే భేదాభిప్రాయం లేకుండా, కులమతాలకతీతంగా ఉత్సాహంగా,ఉల్లాసంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రావిటీ ప్రీమియర్ స్కూల్ కరస్పాండెంట్ బోడా పుణ్య నాయక్ మాట్లాడుతూ ఈ పండుగ చెడుమీద మంచి సాధించిన విజయంగా, అందరి జీవితాలు రంగుల మలే కలర్ఫుల్ గా ఆనందమయం అవ్వాలని, రంగుల హోలీ పండుగ మనజీవితాల్లో ఆనందం, ఐక్యత, సౌభ్రాతృత్వం, నింపే పవిత్ర పండుగ. మన సంస్కృతి సంప్రదాయాల ప్రతీకగా నిలిచిన ఈ హోలీ పండుగ ప్రతి ఇంటా సుఖశాంతులు , ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని మనసారా కోరుకుంటున్నాము. రంగులు ఎలా కలిసిపోతాయో అలాగే మన సమాజంలోని ప్రతి వర్గం, ప్రతి మతం, ప్రతికుటుంబం పరస్పర ప్రేమాభిమానాలతో కలిసిమెలిసి జీవించాలని ఆకాంక్షిస్తున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు .

## పీహెచ్సీలో హోలీ సంబరాలు



**టేకులపల్లి,మార్చి 03,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలోని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణ అధికారి దేవ, సూపర్వైజర్లు కౌసల్య సింగ్, నాగు బండి వెంకటేశ్వర్లు, నర్సింగ్ ఆఫీసర్ జగదాంబ, ఫార్మసీ ఆఫీసర్ రజిత, కిరణ్ కుమారి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు హారిక, శైలజ, ధరణి, అమూల్య,చందన, ఇంద్రజ, రుక్సానా, ఏఎన్ఎంలు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.